# పథకాలను అర్రాస్ పెట్టేది కాంగ్రెస్

- ఆచరణలో పెట్టేది బీఆర్ఎస్
- సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి
- బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- నర్మెట మండలంలో ఎన్నికల ప్రచారం
- ప్రచారంలో పాల్గొన్న ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



ప్రచారంలో మాట్లాడుతున్న జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట, అక్టోబర్ 30 : తెలంగాణలో ప్రజా సంక్షేమ పథకాలను ఆచరణలో పెట్టేది బీఆర్ఎస్ పార్టీ అని, పథకాలను అర్రాస్ పెట్టేది కాంగ్రెస్ అని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ జిల్లా నర్మెట మండలంలోని గండి రామవరం, మాన్‌సింగ్‌తండా, దొంగచెలిమెతండా, ఆగాపేట, ఇసుకబాయితండా, మచ్చుపహాడ్, సూర్య బండతండా, లోక్యతండాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, వాయిద్యాలు, పూలు చల్లుతూ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై మంగళహారతులతో స్వాగతం పలికారు. గండిరామవరం గ్రామంలోని ప్రచారంలో స్థానికులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డీసీతండా, దొంగచెలిమెతండా, ఇసుకబాయితండా ప్రచారంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, రైతుబంధు సమితి రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి అధినేత, సీఎం కేసీఆర్ ఒక విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలుకాని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పథకాలను కాంగ్రెస్ అర్రాస్ పెడుతున్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో తెలంగాణలో అమలయ్యే పథకాలను ఎందుకు అమలు చేయడం లేదో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న 24గంటల కరెంట్ వద్దంటున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎవరూ ఎలాంటి మాటలు చెప్పినా నమ్మవద్దని, ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేస్తున్న కేసీఆర్ వెంట నిలువాలని కోరారు. కారు గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపిస్తే జనగామను అభివృద్ధికి కంచుకోటగా మారుస్తానన్నారు. ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ లంబాడీలకు పెద్దపీట వేశారన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్ది లంబాడీల చిరకాల కోరికను నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




జనగామ పట్టణ కేంద్రంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మేకల రామ్‌ప్రసాద్

## పల్లాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

### -మున్సిపల్ వైస్ చైర్మన్ రామ్‌ప్రసాద్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 30 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనగామ మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 23వ వార్డు బీరప్పగుడి ఏరియాలో పల్లాకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ 23వ వార్డు అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి పంతులు అరుణ, సోషల్ మీడియా ఇన్‌చార్జి మహేశ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగామపై గులాబీ జెండా ఎగరడం ఖాయం



ధూళిమిట్టలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 30 : జనగామ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధూళిమిట్ట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. సోమవారం ధూళిమిట్ట మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువనున్నారని తెలిపారు. వచ్చే నెల 5వ తేదీన ధూళిమిట్ట మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో బూత్ కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బండి చంద్రయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపీపై దాడి గర్హనీయం

చేర్యాల, అక్టోబర్ 30 : ఎన్నికల ప్రచారంలో భాగంగా దుబ్బాక నియోజవర్గంలో పర్యటన చేస్తున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి హేయనీయమని జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికల్లో పాల్గొనాలని, దాడులు చేసే సంస్కృతి ప్రజాస్వామ్యంలో సరైంది కాదన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై సమగ్ర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఓటమి భయంతోనే దాడులు

చేర్యాల, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఖాయమని గ్రహించిన ప్రతిపక్ష నేతలు తమ అనుచరులతో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడులకు ఉసిగొల్పుతున్నారని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఆకుల రాజేశ్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. దాడి చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 30 : ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన తొగిటె వెంకటమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబానికి జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ రూ.10వేల ఆర్థిక సాయం సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జాటోత్ ఖల్‌రామ్‌నాయక్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

## గిరిజన ఆత్మబంధు మండల అధ్యక్షుడిగా ఖల్‌రామ్‌నాయక్

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 30 : గిరిజన ఆత్మబంధు ధూళిమిట్ట మండల అధ్యక్షడిగా హనుమతండాకు చెందిన జాటోత్ ఖల్‌రామ్ నాయక్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ రూప్‌సింగ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్యనాయకులు ఖల్‌రాన్ని సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, దోమ బాలమణీబాలకృష్ణ, లకావత్ సుజాతాశ్రీనివాస్, శివలాల్, ఎంపీటీసీ నందన బోయిన నర్సింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హుస్నాబాద్, అక్కన్నపేటలో ఫ్లాగ్ మార్చ్

హుస్నాబాద్, అక్టోబర్ 30 : ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకోవాలని ఏసీపీ వాసాల సతీశ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం కేంద్ర ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రచారానికి వస్తే అడ్డుకోవద్దని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను టోల్‌ఫ్రీ నంబరు 1950కు కాల్ చేయాలన్నారు. సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అందులో ఫిర్యాదులు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ ఎర్రల కిరణ్, ఎస్సైలు తోట మహేశ్, వివేక్, తిరుపతి పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



చేర్యాల మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్

### ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్

చేర్యాల, అక్టోబర్ 30 : ధాన్యం కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్ కోరారు. పట్టణంలోని ఐకేపీ కార్యాలయం సమావేశపు మందిరంలో చేర్యాల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ జోగిని పల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం చివరి గడువుగా ఎన్నికల కమిషన్ నిర్ణయించిందని, ఇప్పటి వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఐకేపీ ఏపీఎం చర్యలు తీసుకోవాలని అధికారులకు సభ్యులు సూచించారు. దొమ్మాటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని సర్పంచ్ కోరారు. సభలో ఎంపీడీవో సయ్యద్ తారిఖ్‌అన్వర్, మిషన్ భగీరథ డీఈ అనిల్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## 'మేరి మట్టి, మేరా దేశ్'కు కొమురవెల్లి యువకుడు

కొమురవెల్లి, అక్టోబర్ 30 : దేశ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా 'ఆజాది కా అమృత్ మహోత్సవ్' ముగింపు వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 30, 31వ తేదీల్లో నిర్వహిస్తున్న 'మేరి మట్టి మేరా దేశ్' కార్యక్రమానికి కొమురవెల్లికి చెందిన కటంకం అమరేందర్ ఎంపికైనట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మూల రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అమరేందర్ మాట్లాడుతూ కొమురవెల్లిలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సేకరించిన మట్టిని ఢిల్లీకి తీసుకెళ్లినట్లు తెలిపారు.




కొమురవెల్లి నుంచి తీసుకెళ్లిన మట్టిని చూపుతున్న అమరేందర్